

# న చిత్ర ... పత్రిక

- భాగవతుల సుబ్రహ్మణ్యం

"సుబ్బలక్ష్మీ ! ఇప్పుడేం చేద్దామంటావ్ ?'' అడిగాను నేను, చిరు చెమటని కర్చీఫ్‌తో అద్దుకుంటూ.

నేనో సచిత్ర .... పత్రికకి (దిన/వార/మాస/వార్షిక ... అనేది మీ ఇష్టం!) 'హాఫ్‌ఫ్లెడ్జ్‌డ్' ఎడిటర్'ని (ఇలా ఎందుకు అనాల్సి వచ్చిందంటే - పగ్గాలు పూర్తిగా నా చేతిలో లేవు కనుక).

"ప్రింటర్ అండ్ పబ్లిషర్ కమ్ ఓనర్' అనబడే యజమాని మహాశయుడు నా పైన దయ 'చూప' ర్విజన్ చేస్తున్నాడు అనేది జగద్విదితం. ఇలాటి ఎడిటర్లు కొన్ని కొన్ని సందర్భాల్లో పడే బాధ వర్ణనాతీతం. అది అనుభవైక వేద్యమే తప్ప, చెప్తే అర్థం కానిదన్నమాట! స్వయంనిర్ణయాలు తీసుకొనే వీలుండదు. అలాగని నిష్పూచీగా వదిలెయ్యడానికీ కుదరదు.

సబ్బెడిటరు సుబ్బలక్ష్మి అల్లరిగా నవ్వింది - రెండు చేతుల్తోనూ పట్టుకున్న కొంగుని మునిపంట నొక్కిపెట్టి. (మరొకప్పుడైతే, నాకా పోజు తెగ నచ్చేదే కాని, నేను డైలమాలో పడ్డప్పుడల్లా, ఆమె అదే పోజులో నవ్వుతూంటుంది.)

ఎదుర్కోవలసిన పరిస్థితి అసలే ఓపక్క మండిస్తూంటే - ఆమె నన్ను పరిహాసిస్తున్నట్టు నవ్వడం ... హుఁ .... చిరాకెయ్యదూ ? ... బట్ ... ఏమాట కా మాటే చెప్పుకోవాలి . నా సబ్బెడిటర్లలో కెల్లా బెటరు సుబ్బలక్ష్మి మాత్రమే అని ఒప్పుకొని తీరాలి !

ఓ అరగంట కిందట ....

ఆ వేళ పోస్టు పదిలంగా పట్టుకొచ్చి నా టేబుల్ మీద పెట్టి, వాటి మీద నా రియాక్షన్ ఏమిటో చూడ్డానికా అన్నట్టు - నా కేబిన్‌లోకి అడుగు పెట్టింది. అంటే - సదరు పోస్టు పది లెటర్ల లోనూ, నన్నిరుకున పెట్టే మేటర్ తాను ముందుగానే చదివేసిందనేగా అర్థం !?

నా అవస్థ తెలిసీ కూడా, 'తరుణీ'పాయం చెప్పకుండా అలా నవ్వుతూంటే చిరాకెయ్యదూ? (ఇలాంటి సందర్భాల్లో తరుణీమణులకి తోచే ఉపాయాలనే తరుణీపాయాలందురు).

"కూర్చో!'' అనక్కర్లేకుండానే, ఎదుటి కుర్చీని పక్కకి లాక్కుంటూ కూర్చుంది సుబ్బలక్ష్మి.

ఇంతకీ ఆ మెగారైటర్ సుందర మూర్తి ఏమంటాడంటే ...'' లా - ఆ - ఆగుతూన్న సుబ్బలక్ష్మిని కట్‌చేస్తూ "ఉపోద్ఘాతాలొద్దు'' అన్నాను కటువుగా.

"ఉత్తరం చదివారుగా ! మన స్టాఫ్ ఆర్టిస్టుల్లో ఏ ఒక్కరికీ బొమ్మలెయ్యడం చేతగాదట! ఒక్కళ్లకీ విషయ పరిజ్ఞానం లేకపోగా, పైగా బద్ధకమట! మేటర్ సరిగ్గా చదవకుండానే, ఎక్కడో ఓ లైన్ చదివి పారేసి, తోచిన బొమ్మ గీకి పారేస్తున్నారట!

"చాలు! ఆపు! అతడి అభియోగం ఎప్పుడూ ఉండేదే ! ఈ కుర్ర రచయిత్రి ఉత్తరం నువ్వు చూశావ్ కదా! ఆవిడ వీడియో మీడియా మీద నవల రాస్తే, మన ఆర్టిస్టు విష్ణుమూర్తి మామూలు ఫోటోల్తీసే కెమెరా బొమ్మ వేశాట్ట! అలసలెప్పుడైనా వీడియో కెమెరా మొహం చూశాడా మీఆర్టిస్టు?'' అంటూ ఘాటుగా చెడామడా తిడుతోందీవిడ.

"అదలా ఉంచండి ! ఎక్కడా కించిత్తయినా బూతుక్కక్కుర్తి పడకుండా - డీసెంటుగా నేను రాసిన కథకి, బ్లూఫిల్ముని తలదన్నేలా ఆ బొమ్మే మిటండీ వికారంగా?'' అంటూ విరుచుకు పడుతున్నాడీ ఫీచర్రైటరు.

తల పట్టుకున్నాను ఇంకోసారి.

"అవునూ ! మరీ మనం దూరదర్శన్ వారి 'జాబులు-జవాబులు' కార్యక్రమంలో ఉత్తరాలు చదివినట్టు - ఒకళ్లం ఆపితే మరొకళ్లం ఈ ఉత్తరాల్లో మేటర్ డిస్కస్ చేస్తూ కూర్చోడమేనా? దీనికేదో రెమెడీ వెతికే మార్గం ఉందా?" మళ్లీ అడిగాను. "ఎడిటర్ గారికి చెప్పి ..." ఇంకా సుబ్బలక్ష్మి మాట నోట్లో ఉండగానే "ఆపు! నేనా ఎడిటర్? ఆయనా? ప్రతీదీ ఆయనదాకా తీసుకెళ్లడమేనా?" నా విసుగులో కొంత స్వాతిశయం - నా విసురులో నన్ను ఎడిటర్‌గా గుర్తించడం లేదేమో అనే డౌటు కలగలిసిన అంశం వెంటనే పట్టేసుకుంది. సుబ్బలక్ష్మి. మాట మార్చేస్తూ "అబ్బే! అది కాద్సార్! నన్ను పూర్తిగా చెప్పనీయండి! ఈ అభియోగాల గోల మనం పడలేం గానీ, మనం సచిత్ర...పత్రిక అక్షరం మార్చేసి 'న చిత్ర ... పత్రిక' అనేస్తే పోలా?" అనేసింది.

"యూ మీన్ ... నో ఇలస్ట్రేషన్స్?"

"ఊఁ ! ... ఊరుకున్నంత ఉత్తమం లేదు - బోడిగుండంత సుఖం లేదు అని కదూ సామెత. అసలు బొమ్మల్లేకుండా ఏ బెడదా ఉండదని, మదీయాభిప్రాయం!" ముక్తాయించింది సుబ్బలక్ష్మి.

"ఏడ్చినట్టుంది ఒపీనియనూ - నువ్వూనూ. బొమ్మల్లేకుండా పత్రికా? అసలు తలకాయ్ ఉండే మాట్లాడుతున్నావా?" చాలా కాలంగా పనిచేస్తున్న చనువు కొద్దీ, కాస్త పెద్దతనం చూపించబోయాను.

"అబ్బే! తలా తోకా లేక మాట్లాడటం నావల్ల కాదు." చనువు అట్నుంచీ ముదిరిన నైజం వల్ల వచ్చిన జవాబది.

నేను వెంటనే కూల్ అయిపోయాను.

"అదికాదు సుబ్బలక్ష్మీ! కాస్త అర్థం చేసుకోవేం? స్టాఫ్ ఆర్టిస్టు కాకపోతే, ఫ్రీలాన్సర్లు బోల్డంత మంది ఉన్నారు. వాళ్లతో ఇల్లస్ట్రేషన్స్ వేయించుకోలేమా? మనవాళ్లని పేజ్ మేకప్‌కి - వాడుకుంటే సరి!"

"ఏం మహానుభావా! కలిగిన అనుభవాలు అప్పుడు పరగడుపా?" ఫ్లాష్ బ్యాక్ తవ్వింది సుబ్బలక్ష్మి.

నేన్నిజంగానే మరిచిపోయాను. గుర్తు చేసిందామె. అసలప్పట్లో ఏం జరిగిందంటే...

అప్పటికింకా మా పత్రికలో తగినంత మంది ఆర్టిస్టులు లేరు. కేవలం మాపత్రికకే కాదు ... ఒరిజినల్‌గానే పత్రికారంగానికి పనికొచ్చే ఆర్టిస్టులు తక్కువగా ఉన్న సమయమది. మా కర్మ కొద్దీ - సరిగ్గా అప్పట్లోనే కొత్త పత్రికలు ఓ వెల్లువలా విరుచుకు పడ్డాయ్. అందరికీ ఆర్టిస్టులు అవసరమే! ఇంకేం?... వీళ్లకి డిమాండూ - మాకు కృత్రిమ కొరతా ఏర్పడింది లెండి! అన్నీ ఆఫ్ సెట్‌లో ముద్రించే మేగజైన్లే! ఆర్టిస్టు అవసరం ఎక్కువై నిన్నటికి నిన్న నిబ్బు పట్టుకున్న వాడికీ దొబ్బుడాయె! ప్రతివాడూ బెదిరింపే! ఫలానా పత్రిక వాళ్లు ఇంతిస్తామన్నారు. మీరంత కంటే ఎక్కువిస్తారా? లేపోతే ఇదుగో నా రిజైన్ లెటరు ..., ఇదీ వరస. బ్రష్‌తో ఏకబిగిన అరమీటరు స్ట్రెయిట్ లైన్ గియ్యడం రాని వాడు కూడా ఆర్టిస్టేనట! కలర్ స్కీమింగ్ కాదు గదా! దేన్లో ఏ రంగు కలిపితే ఏషేడ్ వస్తుందో ఎరగని వాడు సైతం టూ థౌజండూ -త్రీ థౌజండూ అంటూ ఒహటే డిమాండు. అయితే పుబ్బలో పుట్టి మఖలో మాడిపోయే చందంగా వచ్చిన ఆ పత్రికల వల్ల ఇప్పుడు 'మోర్ దేన్ సఫిషియంట్' ఆర్టిస్టుల మంద ... చెప్పొచ్చేదేమిటంటే - అలాంటి గడ్డు రోజుల్లో ఓ పేరున్న ఫ్రీలాన్సర్‌ని ఇలస్ట్రేషన్స్ వేయ్యవయ్యా బాబూ! అంటే "నా బొమ్మల వల్లే మీ పత్రిక సర్క్యులేషన్ పర్రున తారాజువ్వలా పైకిపోతుంది. అంత టాప్ లెవెల్‌కి మిమ్మల్ని తీసుకెళ్తే, సమ్‌థింగ్ నా క్కూడా బెనిఫిట్ ఉండాలి కదా! నా రేటుకి మీరు తట్టుకో గలరో - లేరో ఆలోచించండి!" ఇదీ జవాబు.

ఔరా! ఏమిటీ విపత్కర పరిస్థితి-అని దిగాలు పడ్డాం! రైటే! ... అతడు గొప్ప ఆర్టిస్టే! సందేహం లేదు. పైగా కమర్షియల్ లైన్లో ఉన్నవాడు. సరే! శక్తికి మించిందైనా, మా ఓనర్‌గార్ని ఒప్పించి కాంట్రాక్టు కుదుర్చుకున్నాం!తీరా చూస్తే ఏముంది? అన్నీ ఫారిన్ మేగజైన్స్‌లోంచి కట్ చేసి, కాస్త టచప్స్ ఇచ్చి పేస్ట్ చేసి ఇచ్చేయ్యడం మినహా అతడు చేస్తున్నదేం లేదు. (ఆఫ్ సెట్ ప్రింటింగ్ టెక్నాలజీ తెలిసిన వాళ్లందరికీ - ఇలాంటి కట్ అండ్ పేస్టప్ బొమ్మలు రీప్రొడక్షన్‌కి పనికొస్తా యన్నది అనుభవైక వేద్యమే!)

ఆ మాత్రం పని - అదీ మాట్రెయినీ కూడ చెయ్యగలడనీ, దానికోసం ఇంత మొత్తం సమర్పించుకోనవసరం లేదనీ మా సబ్బు సుబ్బులే చెప్పడం; నాకూ పై నుంచి - అంటే ఓనరాయణంగారి అక్షింతలు పడడం ఒక్కసారే జరిగే సరికి నా పొరపాటేమిటో తెలిసొచ్చింది. కాని ... కాంట్రాక్టు రీత్యా ఇంకా అతడికీ, మాకూ ఉన్న లింకు కాల పరిమితి ముగిసి పోనందువల్ల టెర్మ్ అండ్ కండిషన్స్ ప్రకారం - ఏ మాత్రమూ క్రియేటివిటీ లేని ఆ ఆర్ట్ భరించవలసి వచ్చింది.

దాంతో - ఒక విషయం నాకు స్పష్టంగా బోధపడింది. ఎడిటర్ అనే వాడికి అంతో - ఇంతో ఆర్టులో కనీస పరిజ్ఞానం ఉండి తీరాలన్నదే ఆ విషయం. ఆర్టిస్టు దగ్గర్నుంచి బొమ్మలు రాబట్టడమే కాదు, అతడెలాటి బొమ్మలు ఇస్తున్నాడనేదీ గ్రహించే తెలివి ఉండాలిగా !


'ఎవరో మేటర్ రాస్తారు... మరొకరెవరో అది టైప్ సెట్ చేసి ఇస్తారు ... (కంపోజ్ చెయ్యడం అనేది అవుట్ డేటెడ్ కనుక). ఇంకొకరు బొమ్మ వేస్తారు... వేరొకరు వీటన్నిటినీ సమీకరించి పేజ్ మేకప్ చేస్తారు... మనం తీరిగ్గా కూర్చొని ఓరగా ఓసారి పరికించి సైన్‌గికి పారేస్తే సరి!' అనుకొనే ఎడిటర్లకి నా ఎక్స్‌పీరియన్సే ఓ కనువిప్పు.

అదంతా సమ్ ... స్ప్లిట్ సెకెండ్స్ .. గుర్తొచ్చి వణికాన్నేను.

"అయితే - నచిత్ర పత్రిక అని వెయ్యడం తప్పుదంటావా? తప్పుకాదంటావా సుబ్బులూ" మరోసారి సందేహాస్పదంగానే అడిగాను.

"మరేం పర్లేదు. ధైర్యం చెయ్యండి సార్! నిజంగా మేటర్లో రీడబిలిటీ ఉంటే, బొమ్మ కోసం ఎవరూ చూడరు. అయినా, ఇప్పుడందరూ విజువల్ మీడియా మీదపడ్డారు. వాటిలో వచ్చే కదిలే బొమ్మల ముందు మనం ఇచ్చే బొమ్మలు ఏ పాటి? స్పేస్ వేస్టు! ఏం" సమర్థించింది సుబ్బలక్ష్మి.

"కాని - ఇప్పుడంటే బోల్డంత మేటరుంది. కనుక ఇలాగంటున్నావ్! రేపెప్పుడైనా మేటర్‌కి



## బాలీవుడ్ బాణీ

సినిమా రంగంపై పూజాభట్ తన అమ్యూల అభిప్రాయం చెబుతూ... "కళాసేవ... లేదా ఇంకేదో సేవ ఇక్కడకు వచ్చామని ఎవరైనా చెబితే అదంతా ఒట్టి ట్రాష్... ఇక్కడకు వచ్చే ప్రతివారు కేవలం డబ్బు సంపాయించే లక్ష్యం తోనే వస్తారు... నేను కూడ డబ్బు కోసమే సినిమాలలో నటిస్తున్నాను. మా అమ్మ చిన్నప్పటి నుంచి నాకు స్వేచ్ఛగా బతకడం నేర్పించింది. నా జీవితం ఎంజాయ్ చేయడానికి డబ్బు చాలా అవసరం... అందుకే డబ్బు కోసమే నటిస్తున్నానని నిక్కచ్చిగా అంది.

మసూద్ అన్సారీ

కొరత వస్తే ఎలా నింపడం?"

"వెరీ సింపుల్! పేజీలు తగ్గించి పారెయ్యడమే!' సింపుల్‌గా చెప్పేసింది సుబ్బలక్ష్మి.

"ఇంకానయం! పత్రిక పల్చబడిందని జనం కొనడం తగ్గించెయ్యరూ!"

'డోంట్ వర్రీ! దాంతోటే రేటు తగ్గించేస్తాం!' ఇంకా సింపుల్‌గా చెప్పేసింది. "మా బాగా చెప్పావ్! అది మన చేతిలో ఉందా? రేటు ఫిక్స్ చేసేది ఓనర్ గారే కదా!".

"అబ్బబ్బా! ఆ మాత్రం తోచకపోతే ఎలా మహాశయా? కవర్ పేజీకి లామినేషన్ పేపర్ తగ్గించేస్తాం! ఇన్నర్ సెట్‌లో సగం పేజీలకి రంగుల ఆర్భాటం తీసేస్తాం!"

"ఓర్నాయనో సుబ్బులూ! నీ బ్రెయినో ఐడియాల పుట్ట. పొదుపు చిట్కాల చిట్టా! అదిసరే గానీ - మర బొమ్మల జాబితాలో ఫోటోలూ కార్టూన్లూ గట్రా చేరవా?"

"ఎంత అజ్ఞానమైన ప్రశ్న సార్? ఇలా తర్కించుకుంటూ కూర్చుంటే మళ్లీ పప్పులో కాలెయ్యడం ఖాయం! మళ్లీ మన మీద ఉత్తరాల దాడి తథ్యం.'

'నిజానికి - ఒకేరోజున కేవలం ఆర్ట్‌కి సంబంధించిన ఉత్తరాలే అన్నీ రావడం ఓ విశేషమైతే, అందులో ఆర్ట్‌ని ప్రశంసించే ఓ ఉత్తరమూ లేకపోలేదు. కాని... మెజారిటీ ఆఫ్ లెటర్స్ మనోధైర్యాన్ని కుంగదీసేవిగానే ఉన్నాయి.

'నా కథకి మీ స్టాఫర్ క్రిస్టాఫర్ వేసిన బొమ్మ ఎంత బావుందంటే - మొత్తం నా కథలోని భావాన్నంతట్నీ ఆయన రేఖల్లోకి అనువదించేశాడా అన్నంత బాగా ...' అంటూ వచ్చిన ఏకైక ఉత్తరం నాకేం గొప్ప స్ఫూర్తిని కలిగించలేకపోయింది.

తరచి చూడగా సుబ్బలక్ష్మి చెప్పిందే సబబుగా ఉన్నట్టు తోచసాగింది. సాలోచనగా అన్నానేను- "అయినా, ఓ సారి పెద్దాయనకి చెప్పి చూస్తేనో?' (పెద్దాయన అంటే యజమాని గారన్నమాట!)

"మీ అమాయకత్వానికి నవ్వొస్తోంది నాకు".

"నవ్వుతూనే ఉన్నావ్‌గా! మళ్లీ ఆ సంగతి మాటల్లో చెప్పడం దేనికి?" మీకు ధైరంలేదు సార్! ధైర్యం లేని వాళ్లు ఎడిటర్లుగా చెలామణీ కాలేరు.'

"ఈ వంకన నన్ను ఎద్దేవా చేద్దామనా? నిజంగా నన్ను రెచ్చగొడుతున్నావ్! చూస్తుండు! వచ్చే సంచిక నుంచే 'సచిత్ర... పత్రిక' అని డిక్లేర్ చేస్తున్నా!"

"ఉడుక్కోకండి! అదేదో ఈ సంచిక నుంచే చెయ్యొచ్చుగా! మెల్లగా అయ్యగార్ని ఒప్పించి, ఈలోగా కాస్త సర్దుకుందామనా?" కొంటెగా ప్రశ్నించింది. - కళ్లజోడులోంచి ఏటవాలు చూపులు ప్రసరింపజేస్తూ.

"శుభం! నాకేం భయమనుకున్నావా? ఎటొచ్చీ రీడర్స్ నుంచి ఎలాటి రెస్పాన్స్ వస్తుందా అని ఆలోచిస్తున్నానంతే!

"వంకలేనమ్మ డొంకట్టుకు విలపించిందన్నట్టు - అదో కుంటిసాకు" సుబ్బలక్ష్మి చురక.

"అబ్బా ఇదుగో సుబ్బులూ! ఇప్పుడే - ఈ ఇష్యూ నుంచే మన పత్రిక బొమ్మలుండవని ఎడిటర్ నోట్ రాస్తున్నా చూస్కో!"



## బాలీవుడ్ బాణీ

హీరోలు, హీరోయిన్లకు కార్లు ఉండటం మామూలే... ఈ మధ్య కాస్త పైకి వచ్చిన ప్రతి తార ఎస్టీమో, జెన్, మెర్సిడస్ కొంటున్నారు. అయితే నటులలో విలక్షణ నటుడైన షారూఖ్ తన విభిన్నతను చివరకు కారులో కూడా చూపించాడు. ఏజెరో కారును షారూఖ్ ఇటీవలే ఏరి కోరి కొన్నాడు. కారును చూడగానే అది షారూఖ్‌దని ఇట్టే తెలిసిపోతుంది. అదీ... ఆయన స్పెషల్.

మసూద్ అన్సారీ

లంచ్ అవర్ అవుతోంది...

ఈలోగానే, సుబ్బలక్ష్మి చూస్తుండగానే నేను నోట్ రాయడమూ. అది టైప్‌సెట్ సెక్షన్‌కి పంపడమూ జరిగిపోయాయి.

"ఇప్పుడు చూడు నా తడాఖా! స్వయం నిర్ణయం చెయ్యలేనవా? ఏదో... ఓనర్‌గారి మీద గౌరవం కొద్దీ..." అంటూ నసుగుతూనే కాలరెగరేస్తున్న నా మీద, మరో దరహాసపు తూపు రువ్వి' అది మీ నిర్ణయం కాదు మహాశయా! అయిడియా నాది. మీ చేత అమలు చేయిస్తున్నానంతే!" అంటూ వెళ్లిపోయింది నా కేబిన్ లోంచి.

లంచ్ ముగించి వచ్చేసరికి - నా టేబుల్ మీదనో చీటీ 'పబ్లిషర్ కమ్ ఓనర్‌గారు రమ్మంటున్నారు' అని.

కొంపదీసి సుబ్బలక్ష్మి డబుల్ గేమ్ ఆడ్డం లేదు కదా! ... ఇక్కడ నా చేత నచిత్ర పత్రికకి కమిట్ చేయించి, ఆయన దగ్గర పత్రిక ప్రిస్టేజ్ పడిపోయే డెసిషన్ తీసుకున్న దుర్మార్గుడుగా నన్ను చిత్రించ లేదు కదా! ...

ఛ!ఛ! సుబ్బలక్ష్మి అలాంటి అమ్మాయి కాదు...

చురుకుదనం ఉన్న చిన్నదేగాని, సీటుకే ఎసరు పెట్టేలా ప్రవర్తించే మితిమీరిన చలాకీతనం చూపెట్టే జాణ కాదు ...

ఓనర్ ఛాంబర్లో కడుగుపెడుతూనే విష్ చేసి, మర్యాద పూర్వకంగా "పిలిచారట సార్" అన్నా.

"ఆఁ! ఏమిటోయ్? మన పత్రికకి నచిత్ర ... పత్రిక అని డిక్లేర్ చేశావుట!" అని మాత్రం ఆగిపోయాడాయన.

అందులోనే బోల్డన్ని అర్థాలు ...

'ఎవర్నడిగి చేశావ్!' అనీ - 'ఏధైర్యంతో చేశావ్' అని - 'లాస్‌వస్తే నువ్వు జవాబుదారీనా?' - 'పోటి పత్రికల మధ్య మన ప్రిస్టేజీ ఏంటి? అనీ ... వగైరా ఎన్నో ... ఎన్నెన్నో...

మొత్తం విషయమంతా సవివరంగా చెప్పి "ఈ యావత్తు కారణాల వల్లా చేశాను" అని సమర్థించుకున్నాను.

అంతా విన్నాక "ఇలాటి విధాన నిర్ణయాలు ఇకపై ఎప్పుడూ తొందరపడి చెయ్యకు. ప్రాబ్లం ఏదైనా ఉంటే నాతో చెప్పాలి కాని, బొమ్మల్లేకుండా పత్రిక ఏంటయ్యా? నా సంతకం లేకుండా అలాంటి నోట్ చూసి డౌటొచ్చి టైప్ సెట్టింగ్ అనంతయ్య నన్ను సంప్రదించాడు కనక సరిపోయింది. నేనే ఆపు చేయించాను. వెళ్లు! వెళ్లి 'కంప్యూటర్ చిత్ర పత్రిక' అని వేరే నోట్ రాయి! ఇకపై మన పత్రికలో ఆర్టిస్టుల బొమ్మలు కాకుండా, కంప్యూటర్స్ డిజైన్ చేసే చిత్రాలుంటాయ్! అప్పుడీ ట్రబుల్స్ ఉండవు..." అన్నాడాయన. "కంప్యూటర్లు మాత్రం పొరపాట్లు చేయవా? అప్పుడీ పాఠకులు విరుచుకుపడరా? వాటికి సజెషన్స్ ఫీడ్ చేసేది మనుషులే కదా!" అనే సంశయం నోటి చివరి దాకా వచ్చింది. అయినా అడిగే ధైర్యం చెయ్యలేక, సరేనని నా సీట్ కొచ్చి కూలబడ్డాను - నోట్ రాయడానికీ; మరిన్ని అక్షింతలు ఇటు పాఠకుల నుంచీ, అటు రైటర్ల నుంచీ వేయించుకోడానికీ.